క్లుప్తంగా

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


గోకవరంలో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న అమ్మవారి సేవకులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ వద్ద నిర్వహించే 22వ శరన్నవరాత్ర ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆలయంలో ఆవిష్కరించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సేవకులు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు తదితరులు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు అమ్మవారి సేవకులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. శరన్నవరాత్ర ఉత్సవాలను విజయవంతం చేయడానికి భక్తులు సహకరించాలని కోరారు.

నేడు లంపకలోవలో ఆధార్ సీడింగ్ క్యాంపు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని లంపకలోవలో సోమవారం ఆధార్ సీడింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ధర్మవరం ఎస్‌పీఎం దిలీప్ ఆదివారం తెలిపారు. లంపకలోవ పరిసర గ్రామాల్లోని పోస్టల్ ఐపీపీబీ అకౌంట్ ఉన్న ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ సీడింగ్ వల్ల రైతు భరోసా, పీఎం, గ్యాస్ సబ్సిడీ, పంట నష్టం వల్ల ఇతర ప్రభుత్వ పథకాలను పొందవచ్చునని తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట్రావు ఆదివారం తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

జగ్గంపేట సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట/గండేపల్లి: జగ్గంపేట సీఐగా వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి ఎస్సైలు టి.రఘునాథరావు, యువీ శివనాగబాబు, జి.సతీష్, ఏఎస్సైలు, హెచ్‌సీలు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ శ్రీనివాస్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమాజంలో గురువులకు ప్రత్యేక గుర్తింపు


ఏలేశ్వరంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: సమాజంలో గురువులకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన గురువులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు దేశెట్టి రామలక్ష్మి, జి.మురళీకృష్ణ, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఎం.భవ్య, సీహెచ్ స్వరాజ్యకుమారి, కె.లింగేశ్వరి, కె.దేవదేవి, టి.శ్రీనివాసరావు, కె.వీర్రాజులను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, చిక్కాల రాజ్యలక్ష్మి, బొదిరెడ్డి గోపి, ఎంఈఓ వరలక్ష్మి , యూటీఎఫ్ నాయకుడు జట్ల సోమరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్త, ఆగమ పాఠశాలలో తాచుపాము కలకలం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో గల సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల ఆవరణలోకి ఆదివారం మధ్యాహ్నం తాచుపాము రావడంతో విద్యార్థులు భయాందోళన చెందారు. అక్కడ గార్డెన్‌లో పనిచేసే కార్మికులు పామును చంపేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన స్మార్త, ఆగమ పాఠశాల చుట్టూ కొండలు ఉండడంతో గతంలో కూడా తాచుపాములు వచ్చేవని విద్యార్థులు తెలిపారు.

ఇసుకే బంగారమాయె..

- తీవ్ర కొరతతో నిలిచిపోతున్న నిర్మాణాలు
- పనుల్లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- అమలు కాని ఉచిత ఇసుక హామీ


తునిలో నిర్మాణదారులకు అరకొరగా లభించిన ఇసుక


ఇసుక కొరతతో చివరి దశలో నిలిచిన నిర్మాణ పనులు

తుని రూరల్: ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ ఇసుక లభ్యమైనప్పటికీ పది రోజులుగా ఇసుక కొనుగోలు చేద్దామన్నా లభించని పరిస్థితి నెలకొంది. దీంతో చివరిదశలో ఉన్న గృహ నిర్మాణ పనులు, ఇటీవల మొదలు పెట్టిన నిర్మాణాలు నిలిచిపోయాయి. దీనిప్రభావం నిర్మాణ కార్మికులపై తీవ్రంగా పడింది. ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోగా కార్మికులు పనుల్లేని పస్తులుండాలన్సి పరిస్థితి దాపురించింది. ఇంటి నుంచి వచ్చిన కార్మికులందరికీ మేస్త్రీలు పనులు చెప్పలేకపోతున్నారు. ఏదో ధరకు ఇసుక అందుబాటులో ఉంటే నిర్మాణ రంగం కొనసాగుతుందని, అప్పుడు కార్మికులకు పనులు లభిస్తాయని మేస్త్రీలు, యజమానులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఇసుక కొరతను నివారించాలని, ఉచిత ఇసుకను లబ్ధిదారులకు చేర్చాలని యజమానులు, కార్మికులు కోరుతున్నారు.

దూరాన్ని బట్టి చార్జీలు

గత ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా నిర్ధిష్ట ధరలకు వినియోగదారుల నిర్మాణ ప్రదేశాలకు గోదావరి నుంచి ఇసుకను సరఫరా చేసింది. జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటించింది. తర్వాత దూరాన్ని బట్టి రవాణా చార్జీలు, లోడింగ్ అన్‌లోడింగ్ రుసుములు వసూలు చేసింది. దీంతో లారీ ఇసుక దూరాన్ని బట్టి రూ.12 వేలు నుంచి రూ.16 వేలు వరకు వినియోగదారుల నుంచి వసూలు చేసింది. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా సరఫరా చేస్తామంటూ పేర్కొన్న ప్రభుత్వం కొద్ది రోజులుగా ఇసుక సరఫరాను నిలిపివేసింది. దీంతో ఇసుక కొరత ఏర్పడి ఇళ్ల యజమానులు, కాంట్రాక్టర్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

తాండవ నది నుంచి ఎండ్ల బండిపై..

తుని నియోజకవర్గంలోని తాండవ నది నుంచి ఎడ్లబళ్లపై ఇసుక తెచ్చుకునేందుకు అనుమతించినప్పటికీ యజమానులు నేరుగా తెచ్చుకునే పరిస్థితి లేదు. దీంతో ఎడ్లబళ్లను ఆశ్రయిస్తే బండి ఇసుక రూ.2500 చెల్లించాల్సి వస్తుందని, ట్రాక్టర్‌కు రూ.7 వేలకు పైగా డిమాండ్ చేస్తున్నారని నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత నిల్వలు కొనుగోలు చేద్దామంటే లారీ ఇసుక ధర రూ.28 వేలకు పైగా ఉందని యజమానులు తెలిపారు. ఇంతగా ఎప్పుడు గరిష్ఠ ధర పలకలేదన్నారు.

నిర్మాణ పనులు నిలిపివేశాం

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ ఇసుక అందుబాటులో లేదు. ఇసుక కొరతతో పది రోజులుగా నిర్మాణ పనులు నిలిపివేశాం. గృహ ప్రవేశానికి ముహూర్తం దగ్గర పడుతోంది. ఇసుక లభిస్తే పనులు పునఃప్రారంభిస్తాం.

– ఎం.మాధవి, తుని

కార్మికులకు పనుల్లేవు

ఇసుక కొరతతో మేస్త్రీలు, సహాయకులకు పనులు ఉండడం లేదు. వారంలో రెండు, మూడు రోజులు పని చెప్పడం కష్టమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోకతప్పదు.

– వరహాలుబాబు, ఆర్‌కేపురం

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఏలేశ్వరంలో కలసిన పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుతోన్నత పాఠశాలకు చెందిన 1981–82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వీరంతా స్థానిక లింగంపర్తిరోడ్‌లోని ఎస్ కన్వెన్షన్ హాలులో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. గత మూడేళ్లుగా ఏటా కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ, ఉద్దగిరి సోమరాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం ఉదయకుమారి సేవలు ఆదర్శనీయం


హెచ్‌ఎం ఉదయకుమారిని సత్కరిస్తున్న డీటీడబ్ల్యూఓ విజయశాంతి, ఉపాధ్యాయులు

తుని రూరల్: ప్రధానోపాధ్యాయురాలిగా పూసర్ల ఉదయకుమారి అందించిన సేవలు సహచరులకు ఆదర్శనీయమని జిల్లా గిరిజన సంక్షేమాధికారి విజయశాంతి అన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న వి.కొత్తూరులో గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఉదయకుమారిని ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. డీటీడబ్ల్యూఓ విజయశాంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయకుమారి ఉపాధ్యాయురాలిగా, హెచ్‌ఓగా రిమార్కు లేకుండా పని చేశారన్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు అమ్మగా నిలిచిన ఉదయకుమారిని స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయులు, సహచరులు విద్యా రంగంలో సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రహదారులపైనే చెత్త, వ్యర్థాలు


స్థానిక దిబ్బలపాలెంలో రహదారిపై పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: పట్టణంలోని రహదారులపై ఎక్కడికక్కడే చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనికి తోడు రహదారులను ఆనుకుని మొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని దిబ్బపాలెం, తోటవీధి, సువ్వయ్యమ్మపేట, సాయినగర్, తదితర ప్రాంతాల్లో రహదారులపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పట్టణంలో వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలతో అవస్థలు పడుతున్న ప్రజలకు పందులు, కుక్కల సంచారం సమస్యగా మారింది. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధర్మవరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్


ధర్మవరంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో భారీగా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనిపై ఇటీవల జరిగిన గ్రామ సభలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు ప్రస్తావించారు. ఫిర్యాదుపై స్పందించిన గ్రామ సర్పంచ్ సుశీల అబ్బాయి ఆదివారం దగ్గర ఉండి వ్యర్థాలను తొలగించారు. పంచాయతీ కార్మికులు పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు.

ఘనంగా అమ్మవారి జాతర

తొండంగి: మండలంలోని బెండపూడిలో కాగితమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన సుమారు 500 మహిళలు పసుపు నీటి కడవలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని ఆ జలాలను అమ్మవారికి అభిషేకించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


బెండపూడిలో పసుపునీటి కడవలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

వేస్ట్ డీకంపోజర్ ద్రావణం తయారీపై అవగాహన


వేస్ట్ డీకంపోజర్ ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ మేనేజర్ నాగేశ్వరరావు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రామకృష్ణ గార్డెన్స్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వేస్ట్ డీకంపోజర్ ద్రావణం తయారీపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల పెంట, ఎండాకులు, పచ్చి ఆకులు ఇతర డీకంపోజర్ ద్వారా కంపోస్ట్ తయారు చేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వానపాముల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు కావడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందన్నారు. అదే వేస్ట్ డీకంపోజర్ ద్వారా అయితే కేవలం 40 నుంచి 50 రోజుల్లో తయారవుతుందని చెప్పారు. ఈ ద్రావణాన్ని వ్యవసాయానికి, కూరగాయల సాగులో ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కొరిపల్లి అప్పలస్వామి, బి.రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది లక్ష్మి, మంగారత్నం, ఉమా, రిలయన్స్ సిబ్బంది వీరవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ హార్ట్ డే


తునిలో గుండె పరిరక్షణపై అవగాహన ర్యాలీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రోటరీ ప్రతినిధులు పట్టణ ప్రధాన వీధుల్లో మారథాన్ వాక్ నిర్వహించి గుండె ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. శరీర భాగాల్లో అతిముఖ్యమైన గుండెను ఆరోగ్యవంతంగా ఉంచుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుండె పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మంగరాజు, ప్రతినిధులు వీర్రాజు, కిషోర్‌రెడ్డి, సుబ్బారావు, ప్రసాద్, నాగిరెడ్డి, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

తుప్పలు.. రాకపోకలకు తిప్పలు


తుని-నర్సీపట్నం రోడ్డులో కాకరాపల్లి శివారున భారీగా పెరిగిన తుప్పలు

కోటనందూరు: తుని–నర్సీపట్నం రోడ్డులో తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయి చెట్లను తలపిస్తున్నాయి. మలుపుల్లో అడవిని తలపిస్తున్న తుప్పల కారణంగా ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుని నుంచి జిల్లా సరిహద్దు ఉప్పరగూడెం వరకూ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుకు ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయి ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును అభివృద్ధి చేసి, ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రత్నగిరిపై సిబ్బంది అంతర్గత బదిలీలు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సిబ్బంది అంతర్గత బదిలీలు జరిగాయి. పలువురి ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది విధులను మార్చుతూ దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహన్‌రావును వ్రతాలు, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగ ఏఈఓగా, కేవీఎస్ఎస్ఆర్‌కే కొండలరావును టెంపుల్, సి సెక్షన్ ఏఈఓగా నియమించారు. వీవీఎస్ఎస్‌బి భ్రమరాంబను అకౌంట్స్, ఆడిట్, అన్నదానం ఏఈఓగా, పాలంకి జగ్గారావును సెంట్రల్ స్టోర్స్, సన్నిధి ఏఈఓగా ఎల్.శ్రీనివాసరావును సీఆర్వో, భూతాది, శానిటేషన్ ఏఈఓగా నియమించారు.

విజయవాడ దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన వెంకటరెడ్డిని పీఆర్వో, రిసెప్షన్ ఏఈఓగా నియమించారు. సూపరింటెండెంట్లలో అనకాపల్లి ప్రసాద్ ఎస్టాబ్లిష్‌మెంట్, రూ.1,500, రూ.రెండు వేలు వ్రతాలు, పీవీఎస్ఎస్ భాస్కర్ భూతాది, ఎంవీ సుబ్రహ్మణ్యం సీఆర్ఓ, బలువు సత్యశ్రీనివాస్ సెంట్రల్ స్టోర్స్, రిసెప్షన్, కె.సతీష్ టెంపుల్, ట్రస్ట్ బోర్డు, పి.కృష్ణప్రసాద్ అన్నదానం, కేవీఎస్ఎస్ఎన్ మూర్తి వ్రతాలు, ఆర్‌టీఐ, శానిటేషన్, పీవీ రమణ సి సెక్షన్, వై. అప్పారావు అకౌంట్స్, ఆడిట్ విభాగాలకు బదిలీ చేశారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని మెరక చామవరం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని చెప్పారు.

హాస్టల్‌కు ఇన్వర్టర్ అందజేత

జగ్గంపేట: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహానికి దాత ఇన్వర్టర్‌ను బహూకరించారు. జగ్గంపేటకు చెందిన ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొత్త కొండబాబు విద్యార్థుల సౌకర్యార్థం ఇన్వర్టర్‌ను సమకూర్చారు. దీనిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాస్టల్ వార్డెన్‌కు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


నల్లబాబు (ఫైల్)

కిర్లంపూడి: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు తెలిపారు. మండలంలోని శృంగరాయుపాలెం గ్రామానికి చెందిన ముక్కా నల్లబాబు(37) తన ఇంట్లోని మిక్సీప్లగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సోదరుడు ముక్కా బుజ్జిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు. మృతుడుకి భార్య, పాప, బాబు ఉన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ


ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన పిఠాపురం జట్టు

శంఖవరం: కాకినాడ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మండలంలోని కత్తిపూడి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఈ క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పిఠాపురం జట్టు ప్రథమ స్థానం సాధించగా, కాకినాడ సిటీ జట్టు ద్వితీయ స్థానం, ప్రత్తిపాడు జట్టు తృతీయ స్థానం సాధించాయి. విజేతలను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీ నగేష్, కార్యదర్శులు తోట సీతారామయ్య, సీహెచ్ సూరిబాబు, వి.సత్యనారాయణ తదితరులు అభినందించారు.

యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలి


తునిలో కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణ, సత్యనారాయణ

తుని: యువత మంచి ప్రవర్తన కలిగి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ అన్నారు. స్థానిక మార్కండ్రాజుపేటలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన సప్తగిరి కోచింగ్ సెంటర్‌ను మాజీ మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించారు. చదువు పూర్తి చేసిన యువత పోటీ పరీక్షలకు శిక్షణ పొంది ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. గ్రామీణ ప్రాంత పేదలకు తక్కువ ఫీజుతో శిక్షణ ఇవ్వాలని మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు జి.చిన్నారావు, బోడపాటి శ్రీను, డాక్టర్ విజయ్, పాలిక శ్రీనివాస్, ఎంఈవో బాబ్జి, లంక సునీల్, అమర్నాథ్ రెడ్డి, నాగేశ్వరరావు,లక్ష్మణ్ పాల్గొన్నారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు స్వామివారికి విశేష పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి


రాము

తుని: పోలీసు కానిస్టేబుల్ పోస్టులను సత్వరమే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శాంతినగర్ గ్రంథాలయంలో ఆదివారం కానిస్టేబుల్ అభ్యర్థులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రెండేళ్ల క్రితం విడుదల చేసిన 6,100 కానిస్టేబుల్ నోటిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటి వరకూ పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. 95,208 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాసి అర్హత సాధించారన్నారు. వారికి ఇప్పటివరకూ దేహదారుఢ్య, మెయిన్స్ రాతపరీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఈ సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

విజయవాడకు భవానీ భక్తుల పాదయాత్ర


కత్తిపూడి నుంచి పాదయాత్రగా బయలుదేరిన భవానీ భక్తులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి గ్రామానికి చెందిన భవానీ భక్తులు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గురు భవానీ కంచబోయిన శ్రీను ఆధ్వర్యంలో మాలలు ధరించిన భవానీలు ఆదివారం స్థానిక నూకాలమ్మ ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. విజయ దశమి రోజున విజయవాడ అమ్మవారి సన్నిధిలో మాలలు సమర్పిస్తామని తెలిపారు.

రూ.50 లక్షలతో కళాశాల అభివృద్ధి

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.50 లక్షలతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. స్థానిక రావులమ్మ నగర్‌లో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత పాలకుల హయాంలో కాలేజీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.35 లక్షలు కేటాయించాలని మంత్రి లోకేష్‌ను కోరిన వెంటనే నిధులు కేటాయించినట్టు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎస్‌పీఎంసీఎల్ ద్వారా నిధులు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణ వర్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.